క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా జి.రవీంద్రారెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా 4వ సారి తనకు అధ్యక్ష పదవి కట్టబెట్టిన విశ్రాంత ఉద్యోగులకు కృతజ్ఞతగా ఉంటానన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తనశాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఎన్నికల అధికారిగా టి.రాఘవరావు వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.భాస్కర్‌రెడ్డి, సహ అధ్యక్షులుగా జి.శ్రీనివాసులు, సత్తారు, కోశాధికారిగా ఎంఏ రంగయ్యలను ఎన్నుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక శాంతి పూజలు చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కంభంరోడ్డులో ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

రేపు శిక్షణ తరగతులు

మార్కాపురం రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఈ నెల 30న స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించనున్నట్లు సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.ఏడుకొండలు, గుమ్మ బాలనాగయ్య తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు నాసర్‌రెడ్డి మృతి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాల వారిపాలేనికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దామిరెడ్డి నాసర్‌రెడ్డి(84) మృతి చెందారు. కొంత కాలంగా వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో ఉన్నారు. పెద్ద అయ్యవారుగా చుట్టుపక్కల గ్రామాలకు తెలిసిన నాసర్‌రెడ్డి ఉపాధ్యాయునిగా రిటైర్డు అయిన తరువాత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. వెలుగొండ స్వామి యోగి వేమన రెడ్ల సత్రానికి ఆయన గత కొంత కాలంగా సేవలందిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మాదాలవారిపాలెంలో నాసర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, కొనకనమిట్ల ఎంపీటీసీ కల్లం దిబ్బారెడ్డి, పార్టీ నాయకులు గుంటూరు నాగిరెడ్డి, బజాజ్ రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి(గోరె), ఆనికాళ్ల ఈశ్వరరెడ్డి, దోర్నాల చిన్న నారాయణరెడ్డి, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వెలుగొండ విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కొనకనమిట్ల: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, రగ్బీ పోటీలకు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పలువురు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కందుకూరు టీఆర్‌ఆర్ జేసీ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో జశ్వంత్, మనోహర్, అఖిలష్, నందివర్ధన్, యువతేజ, మహంత్‌లు మంచి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే జశ్వంత్ అనే క్రీడాకారుడు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీఈటీలు చంద్రశేఖర్, ఖాదర్‌బాషలను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

పొదిలి: జిల్లాస్థాయి వాలీబాల్ జట్టుకు స్థానిక నిర్మలా కాన్వెంట్ విద్యార్థులు ఎంపికయ్యారు. మార్కాపురంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో పి.చరణ్, డి.హర్షవర్ధన్, పి.బ్రహ్మచరణ్, అండర్-14 విభాగంలో ఏ.సాత్విక్, వి.జీవన్, వి.చందులు ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులను కరస్పాండెంట్ రూబీ, వ్యాయామ ఉపాధ్యాయులు కె.స్టీఫెన్ అభినందించారు.

నిత్యం అందుబాటులో ఉంటా!

- పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం
- ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా 52వేల మంది ఓటర్లు అధికంగా నాకు మద్దతు పలికారు
- పార్టీ నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర రెడ్డి


పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: స్థానిక పార్లమెంట్ పరిధిలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు నిత్యం పార్టీ జిల్లా కార్యాలయంలోనే అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన కొద్దిసేపు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో తనకు ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా 52 వేలమంది ఓటర్లు అధికంగా తనకు మద్దతు పలికారన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో సైతం 3వేల మందికిపైగా తనకు ఓటేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు పార్టీ కార్యాలయంలోనే నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు ఇంత పెద్ద ఎత్తున మద్దతు పలికిన ఓటర్లకు సేవ చేసేకునే భాగ్యాన్ని వదులుకోనన్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. పార్టీకి అంకిత భావంతో ఉన్న కార్యకర్తల జోలికి టీడీపీ కూడా నేరుగా రాలేదని, ఒక వేళ ఎవరైనా అధికారులను అడ్డం పెట్టుకుని ఇబ్బంది పెట్టాలని చూస్తే మాత్రం న్యాయబద్ధంగా పోరాడతామన్నారు. అలాంటి అధికారులు రిటైర్డ్ అయినా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. కొంత మంది కార్పొరేటర్లు తల్లిలాంటి పార్టీని వీడారని, అయినా వాళ్లు తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో తల్లి చెంతకు తిరిగి వస్తారని భావిస్తున్నామంటూ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించారు.

గృహ లబ్ధిదారులు త్వరితగతిన గృహనిర్మాణాలు చేపట్టాలి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ జగనన్న కాలనీ గృహ లబ్ధిదారులు త్వరితగతిన గృహనిర్మాణాలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా రాజానగర్‌లో గృహ లబ్ధిదారులకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదప్రజల సంక్షేమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిసెంబర్ నాటికి గృహలబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలన్నారు. నగర పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు. నగర పంచాయతీలో అహ్లాదకర వాతావరణం కోసం పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ డి.వెంకటదాస్, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, హౌసింగ్ ఈఈ దాశరదిశర్మ, డీఈ ఖదీర్‌బాషా, కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్ యాదవ్, గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి


వెలుగొండ శ్రీవారి దర్శనంలో భక్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మతల్లి ఆలయాల్లో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

సీసీరోడ్లు వేసి నీటి సౌకర్యం కల్పించండి


లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తర్లుపాడు: సీసీ రోడ్డు, నీటి సౌకర్యం కల్పించి జగనన్న కాలనీని అభివృద్ధి చేయాలని జగనన్న లేఅవుట్ కాలనీ వాసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు ఆధ్వర్యంలో మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం లేఅవుట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ నరసింహులు, మండల స్పెషలాఫీసర్ పురాతనరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కాలనీవాసులు స్థానిక సమస్యలు ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎంఈఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఎంఈఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందచేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

మార్కాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఎంఈఓ బి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవి వీరారెడ్డి మాట్లాడుతూ అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంటు పోస్టులను మంజూరు చేయాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లు, పండిట్ పీఈటి పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని, అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలపై ఎంఈఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావుకు వినతిపత్రం అందచేశారు. జిల్లా మున్సిపల్ టీచర్స్ కన్వీనర్ రవికుమార్, కోశాధికారి శ్రీనివాసనాయక్, నాయకులు విజయలక్ష్మి, అంకమ్మ, లక్ష్మీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి


మార్కాపురంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మార్కాపురం: పౌష్టికాహార లోపాలు లేకుండా తల్లీబిడ్డలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవీ, అరుణ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, నారాయణమ్మ, అశ్వినీ తదితరుల ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలు తయారుచేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించారు. ధనలక్ష్మి, వెంకటరత్నం, పద్మ, మాధవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థులు


రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులు

తర్లుపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాకీ పోటీల్లో తాడివారిపల్లి జెడ్పీ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల హెచ్‌ఎం అజీమ్ బాషా తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్ 14,17లో మైనంపాడులో నిర్వహించిన పోటీల్లో పాఠశాల క్రీడాకారులు లక్ష్మీ గురునాథ్, కార్తీక్, వెంకట శ్రీరామ్, భాను శ్రీ, భవానీ, స్వర్ణ, కల్యాణ్ రామ్, మహేష్‌చంద్ర, పవన్‌కుమార్, సిరిచందన, వెంకట పావని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు వివరించారు. పీడీ రాజశేఖర్‌ను గెలుపొందిన క్రీడాకారులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం పుట్టపర్తి శ్రీసత్యసాయి సేవా సంస్థ తరపున పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భగవద్గీతతో పాటు పలు అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

మార్కాపురం: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి శ్రీధర సాయి సుబ్బారావు కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను పీకి, చెత్తా చెదారాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి తొలగించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యామ్ సుధాకర్, ఉపాధ్యాయుడు జి. రమేష్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గుర్రం జాషువా


నివాళులర్పిస్తున్న శాంసన్, హుస్సేన్ పాచ్చా


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

మార్కాపురం: అభ్యుదయ కవి గుర్రం జాషువా చిరస్మరణీయులని, సమాజానికి ఉపయోగపడే అనేక రచనలు చేసిన గొప్ప దార్శనీకుడని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని సూచించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం నాయకులు రంగస్వామి గౌడ్, గోసు సుబ్బారావు, సాధం వీరయ్య, రాజ్‌కుమార్, పురుషోత్తమ్, నాగం రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

పొదిలి: గుర్రం జాషువా వర్ధంతిని స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకుడు కె.శ్యాంసన్ మాట్లాడుతూ విశ్వకవి సామ్రాట్ తదితర బిరుదులతో ప్రసిద్ధి చెందిన కవిగా జాషువా గుర్తింపు పొందారని కొనియాడారు. హుస్సేన్ పాచ్చా, సురేంద్ర సాగర్ తదితరులు ఉన్నారు.

భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి

కొమరోలు: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జీవితాన్ని ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బందుగుల సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతిలు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భగత్‌సింగ్ జీవిత విశేషాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడు మృతి

బేస్తవారిపేట: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లె టోల్ ప్లాజా సమీపంలో హౌసింగ్ లేఅవుట్ వద్ద శనివారం జరిగింది. బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండంకు చెందిన మోక్షగుండం సత్యనారాయణ (32) గత కొన్నేళ్లుగా బేస్తవారిపేట బార్బర్ షాప్ పెట్టుకుని జీవిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడటం, అప్పులతో తీవ్ర మనోవేదనతో ఒత్తిడికి గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో బార్బర్ షాపులో పనిచేస్తున్నానని ఫోన్‌లో భార్య తులసీకి చెప్పాడు. కాగా పందిళ్లపల్లె టోల్‌ప్లాజా సమీపంలో హౌసింగ్ లేఅవుట్‌లోని ఓ అసంపూర్తి గృహంలో గుర్తు తెలియని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతదేహం పక్కన పురుగుమందు డబ్బా, మద్యం సీసా ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం మోక్షగుండం సత్యనారాయణగా గుర్తించారు. పోలీసులు మృతుడి తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మహాలక్ష్మిలకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశం నిర్వహిస్తున్న జాటోత్ హుస్సేన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా

- వారికి లైసెన్స్‌లు ఇవ్వాలి
- లోన్లు ఇచ్చి ఆర్థికంగా ఎదిగేలా ఆదుకోవాలి
- కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

కొత్తపట్నం: గిరిజన సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలో రంగాయపాలెం తుఫాన్ షెల్టర్‌లో శనివారం యానాది సామాజికవర్గం వారితో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగన్నాథరావు అధ్యక్షత వహించారు. ముందుగా యానాది వాసుల సమస్యలు గురించి తెలుసుకున్నారు.

ఆ ప్రాంత యానాది వాసులు మాట్లాడుతూ బకింగ్ హామ్ కెనాల్‌ను ఆధారంగా చేసుకుని చేపలు పట్టేవారికి లైసెన్సులు మంజూరు చేయాలని కమిషన్ సభ్యులు దృష్టికి తీసికెళ్లారు. జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ వెంటనే బకింగ్‌హామ్ కెనాల్ పరిధిలో చేపలు పట్టే వృత్తిపై ఆధారపడి జీవించే వారికి లైసెన్సులు మంజూరు చేయాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ తెగల కమిషన్ ఉందన్న విషయం ఇప్పటికీ వారిలో ఎక్కువమందికి తెలియదని.. దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. పట్టిన చేపలు తీసుకోవాడానికి ద్విచక్రవాహనాలు, సైకిల్ కూడా ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ నెల రోజుల్లోపు తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి అర్హులకు పంపిణీ చేస్తారన్నారు. పట్టిన చేపలను తెచ్చుకునేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలయినా ఆదివాసీలయుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి ఆదివాసీ.. బిడ్డలకు ఇవ్వడం సంతోషకరమైన విషయమని తెలిపారు. లైసెన్స్‌లు ఇస్తే జీవితాంతం అధికారులను గుర్తిపెట్టుకుంటారన్నారు. షెడ్యూల్డ్ తెగలకు కార్పొరేషన్ నిధులు కోట్లు మురిగిపోతున్నాయన్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. మీ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ ఆవులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, తహసీల్దార్ మధుసూధన్‌రావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ సభ్యులు, రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివారెడ్డి, సత్యం, యానాది కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్నోసార్లు అడిగి అలిసిపోయాం

యానాదులకు లైసెన్స్‌లు గురించి 15 సంవత్సరాల పాటు అడిగి అలసిపోయామని.. ఇప్పుడు ఏమి ఇస్తారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ఆఫీసులు చుట్టూ తిరిగి చెప్పులు అరిగిపోయేలా తిరిగామన్నారు. ఇటువంటి సమావేశాలు చాలా సార్లు పెట్టారని.. కానీ లైసెన్స్‌లు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడేమి ఇస్తారు అని ప్రశ్నించారు. లైసెన్స్‌లు ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు కోల్పోతున్నామని వాపోయారు. ఇప్పటి కైనా లైసెన్స్‌లు ఇచ్చి ప్రభుత్వ నుంచి వచ్చే రాయితీలను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

ఒంగోలు అర్బన్: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని.. అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజనుల అభివృద్ధి కోసం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి అమలు చేస్తునన కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో గిరిజన కుటుంబాలకు అందేలా పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజన స్థితిగతులను ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని ఆయా వర్గాల ప్రజలకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చెంచు గూడేల్లో మౌలిక వసతులు కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జన్‌మన్ కార్యక్రమం కింద చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు పలువురు గిరిజన ప్రజలు వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ బోగస్ కుల ధ్రువీకరణతో ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ఉన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భూ సమస్యలు ఉన్నట్లు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, ఐటీడీఏ పీఓ సురేష్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


వెలుగొండస్వామి ఆలయంలో అన్నా పూజలు


మార్కాపురం ఆలయంలో పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు


కంభం: వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


మీడియాతో మాట్లాడుతున్న షంషేర్ అలీబేగ్, పీఎల్పీ యాదవ్ తదితరులు

తిరుమల పవిత్రత దెబ్బతీసేందుకు
బాబు కుట్ర

- వెలుగొండస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నేతల పూజలు

కొనకనమిట్ల: తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంకణం కట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై, తిరుమల పవిత్రతపై ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, సీఎం హోదాలో చంద్రబాబునాయుడు చేసిన పాపం ప్రక్షాళన కోరుతూ శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నేతలతో కలిసి వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలను చంద్రబాబుతో పాటు కూటమి నేతలు రాజకీయ ప్రయోజనాలకోసం లేనిపోని అబద్ధాలు సృష్టించి రాద్ధాంతం చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. చంద్రబాబు దుష్ప్రచారాలు ఇకనైనా ఆపకుంటే సాక్షాత్తు ఆ వెంకటేశ్వరస్వామి నిన్ను క్షమించడని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోవడానికి వెళుతుంటే పాలకులు కుట్రలతో అడ్డుకోవటం సరికాదని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. పవిత్ర పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్తామంటే పోలీసులతో 30 యాక్ట్‌ను ప్రవేశపెట్టడం ప్రభుత్వ దుర్మార్గ చర్యగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, వెలుగొండస్వామి ఆలయ మాజీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, ఎస్సీసెల్ కార్యవర్గ సభ్యులు చిరుగూరి కోటేశ్వరరావు, మంచికల కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు పట్టణంలోని రాచర్ల రోడ్డు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కడప లక్ష్మి మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం విశిష్టతను రాజకీయ లబ్ధి కోసం అధికార పక్షం నాయకులు అపవిత్రం చేసినందుకు వైఎస్సార్ సీపీ నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాజకీయ దుర్బుద్ధితో లడ్డూకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అబద్ధపు ప్రచారం చేయడం తిరుమల లడ్డూ విశిష్టతకు భంగం కలిగిందన్నారు. అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబునాయుడు అసతస్య ప్రచారాన్ని ప్రక్షాళన చేసేందుకు పూజలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భూమా నరసింహారెడ్డి, ఆర్యవైశ్య విభాగం నాయకులు గర్రె చిరంజీవి, భూపాల్ యాదవ్, కృష్ణారెడ్డి, పగడాల రంగస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అన్నా రాంబాబు

కొమరోలు: రాజుగారికోటలో వెలసిన షిర్డీసాయిబాబా దేవాలయంలో వైఎస్సార్ సీపీ నేతలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదం పవిత్రతపై దుష్ప్రచారం చేస్తున్న సందర్భంగా ఆ మాటలను ప్రక్షాళన చేయాలని కోరుకుంటూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు ఆధ్వర్యంలో నాయకులు సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు షేక్ సుభానీ, తిరుపతిరాజు పాల్గొన్నారు.

కంభం: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తామంతా అండగా ఉంటామని నాయకులు, కార్యకర్తలు తెలిపారు. మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, కంభంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామ్మూర్తి, ఎంపీటీసీ నాగరాజు, పాపా రమణారెడ్డి, కనుమర్ల రమణారెడ్డి, సబ్బసాని వెంకటేశ్వరరెడ్డి, చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారుతి, రమణ, సురేష్, నేరెళ్ల శ్రీను, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పవిత్ర తిరుమలను కూటమి ప్రభుత్వం రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక దరగకొండపై వెంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూను రాజకీయం కోసం అపవిత్రం చేశారన్నారు. జరగని విషయాన్ని జరిగినట్లు విషప్రచారం చేయడం కూటమి నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజామీయా, ఎంపీటీసీలు కుంపటి సురేష్, గుంటి చిరంజీవి, వెన్నా భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘ జిల్లా నాయకులు టీవీఎస్‌పీ శర్మ, నాయకులు బొగ్గు శ్రీహరి, నరసయ్య, మౌళాలి, చిరంజీవిరెడ్డి, శేఖర్, గాజుల బాషా పాల్గొన్నారు.

అర్థవీడు (బేస్తవారిపేట): మండలంలోని నాగులవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల ప్రసాదంపై చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితోనే లేనిపోని ఆరోపణలు చేసి తిరుమల పవిత్రతకు కళంకం తెచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, నాగులవరం, కాకర్ల, బోగోలు మాజీ సర్పంచ్‌లు ఎరువ రంగారెడ్డి, ఆవులయ్య, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలి

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం, లడ్డూ ప్రసాదంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మరని, వాస్తవాలను బయటకు తీసేందుకు సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూపై చేస్తున్న అసత్య ప్రచారం ప్రక్షాళన కోసం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం బయట అన్నా రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవర్తించడం దారుణమన్నారు. కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమైన వెంకటేశ్వరస్వామిని రాజకీయాలకు వాడుకోవడం మంచిది కాదన్నారు. అసత్య ఆరోపణలపై విచారణ చేసి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. వాడని నెయ్యిని వాడినట్లుగా ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈయన వెంట మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్ -2 అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు మేడా బద్రీనాథ్, నల్లబోతుల కొండయ్య, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, నగేష్, కొత్త కృష్ణ, సిరాజ్, హర్షిత, ముంగమూరి శ్రీనివాసులు, మారంరెడ్డి లతా రామకృష్ణ, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ పత్తి రవిచంద్ర, గుంటక వెంకటరెడ్డి, ఎంపీపీలు లక్ష్మిదేవీ కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, పత్తి కృష్ణ, ఇతర నేతలు పాల్గొన్నారు.


గిద్దలూరు: ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కొమరోలు: సాయిబాబా దేవస్థానంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, నేతలు


బేస్తవారిపేట: వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు


అర్థవీడు: నాగులవరంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్వామి ప్రసాదంపై దుష్ప్రచారం ఆపండి

మార్కాపురం: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూపై కూటమి నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, బీసీ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్‌లు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మార్కాపురంలో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ స్వామి ప్రసాదమైన లడ్డూలో కల్తీ జరగలేదని టీటీడీ ఈఓ స్పష్టంగా చెబుతున్నా కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దని, కోట్లాది మంది విశ్వాసానికి, నమ్మకానికి ప్రతీకగా నిలిచే తిరుమల వేంకటేశ్వరస్వామి గురించి పదిరోజులుగా చేస్తున్న ప్రచారంతో ప్రజల మనస్సులు కలత చెందాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కూటమి నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మరన్నారు. సున్నితమైన ఈ అంశంపై రాద్ధాంతం చేయకుండా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, అప్పుడు దోషులెవరైనా శిక్షించాలని తాము కోరుతున్నట్లు వారు తెలిపారు. స్వామి విశిష్టతను పెంచాలని, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీస్తే మీకే ప్రమాదమన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, జిల్లా నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు అమీరుల్లాఖాన్, వై రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ చంద్రబాబునాయుడికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూజలు చేశారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి ఆలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నిత్యం అబద్ధాలు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గొలమారి చెన్నారెడ్డి, యక్కలి శేషగిరిరావు, కె.నరసింహారావు, గుజ్జుల రమణారెడ్డి, జూపల్లి ఏడుకొండలు, వర్షం ఫిరోజ్, మస్తాన్, మోరా శంకర్‌రెడ్డి, దాసరి ఏడుకొండలు, మోరబోయిన మురళీ, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.